# నమ్ముతాను

"చాలు, అక్కడికి ఆపేసి అది టైప్ చెయ్యండి. మిగతాది రేపు డిక్టేట్ చేస్తాను." పాంటు జేబులో చేతులు పెట్టుకుని గదిలో అటు యిటు పచార్లు చేస్తున్న సారథి హఠాత్తుగా ఆగి కిటికీ దగ్గరకు వెళ్ళి తొంగి చూస్తూ అన్నాడు. అతనెందుకు మధ్యలో అలా ఆపు చెయ్యమంటున్నాడో జయంతికి తెలుసు. క్రింద కారు హారన్ విన్పించింది. ఆ హారన్ జయంతికి సుపరిచితమే. మిసెస్ సారథి సాయంత్రం క్లబ్బుకు వెడుతూ భర్తకోసం ఆఫీసుకు వచ్చింది. ఇక్కడనుంచి యిద్దరూ కలిసి వెడతారు. వ్రాయటం ఆపేసిన జయంతి బుక్ మూసేసింది. కుర్చీకి తగిలించిన కోటు తీసి వేసుకుంటున్న సారథి క్షణంసేపు తటాపటాయించి జయంతివేపు చూస్తూ "మీరేమీ అనుకోకపోతే-రేపువస్తే-అదికొంచెం పూర్తి చేద్దాం. నేను బుధవారంలోపల రిపోర్టు గవర్నమెంటుకి పంపించేసేయ్యాలి" అన్నాడు.

టైప్ రైటర్‌కి తెలకాగితాలు బిగించబోతున్న జయంతి ఆగి సారథి వైపు చూసింది. రేపు ఆదివారం, సుందరి భోజనానికి పిలిచింది. సినిమాకు వెళ్ళాలి అని ప్రోగ్రాం కూడా వేసుకున్నారు.

"సారీ, మీకు టైముంటేనే! ఎక్కువసేపు పట్టదు. ఒకటి రెండు గంటలు చాలు!" సారథికి తనంటే తనకే అసహ్యం వేసింది. ఇప్పుడిలా మధ్యలో ఆపేసి వెళ్ళటం అతని కేమాత్రం యిష్టంలేదు. అమూల్యతో వెళ్ళి తను చేయబోయే ఘనకార్యం కూడా ఏమీలేదు. ఐదు గంటలు దాటితే ఆఫీసులో ఉండటం అమూల్య సహించలేదు. అమూల్యని పెళ్ళి చేసుకున్న రోజునే తన స్వంత అభిప్రాయాలకి తిలాంజలు లిచ్చే

కాడు. సహజంగా భార్యలు భర్తలతో సర్దుకుపోతారని వినికిడి. కాని భార్యలతో సర్దుకుపోయే భర్తలు కూడా ఉన్నారని ప్రపంచంలో చాలా కొద్దిమందికే తెలుసునేమో!

క్రిందనుంచి కారు హారన్ మరోసారి బొంయ్ బొంయ్ మని విన్పించింది. అందులో ఏమిటింకా ఆలస్యం అన్న హెచ్చరిక వుంది. పెన్ తీసుకుని కోటుజేబుకి పెట్టుకున్న సారథి హడావుడిగా కళ్ళజోడు తీసుకుని పెట్టుకుంటూ "ప్లీజ్! మీరు రేపు ఒక్కసారి తప్పకుండా రావాలి" అని త్వరత్వరగా బయట కెళ్ళిపోయాడు.

"చూడు రంగయ్యా! ఆ అమ్మాయి యింకొంచెంసేపు ఉంటుంది. కాఫీ, టిఫిన్ తెచ్చిపెట్టు. నువ్వు గూడా ఉండు. ఇవిగో డబ్బులు" అని చెప్పటం విన్పించిన జయంతి నిట్టూర్పు విడిచి టైప్‌రైటర్ వదిలి లేచి కిటికీ దగ్గరగా వచ్చింది.

మూడో అంతస్తులో పైభాగంలోఉన్న ఆ గదిలోంచి చూస్తే క్రింద విశాలంగా ఉన్న ఆవరణ కన్పిస్తుంది. ఆ ఆవరణలో ఆకుపచ్చటి పొడుగ్గా విమానంలా రెక్కలు చాచుకుని ఉన్న పెద్ద కారు. డ్రయివింగ్ సీటులో ఓ చెయ్యి స్టీరింగ్‌మీద వేసుకుని అమూల్య కూర్చుని వుంది. లేత ఆకుపచ్చ రంగుచీర, దానితో కలిసే ముదురాకు పచ్చ రంగులో భుజాలులేని జాకెట్టు, మెళ్ళో పొడుగ్గా తెల్లటి ముత్యాలదండ రెండు వరుసల్లో ఉంది. అమూల్య జుట్టు రోజుకో రకంగా వుంటుంది. ఈ రోజు నడినెత్తిమీద సిగ వేసుకుంది.

జయంతి చూస్తుండగానే సారథి వెళ్ళి డోరుతెరచి లోపల కూర్చున్నాడు. అమూల్య చేతికున్న వాచీ చూసుకుంటూ ఏదో అంటోంది. అమూల్య అడిగినదానికి జవాబు చెబుతుండగానే సారథి చూపులెందుకో హఠాత్తుగా పైకివెళ్ళి తన ఆఫీసు గదిమీద నిల్చాయి. అక్కడ కిటికీ చువ్వలు పట్టుకొని బొమ్మలా నిలబడ్డ జయంతి క్రిందకు చూస్తోంది. సారథి మనస్సు కలుక్కుమంది. క్షణంసేపు అమూల్యకేదయినా సాకు చెప్పి దిగి ఆఫీసులోకి వెళ్ళిపోవాలనిపించింది. ఈలోపలే అమూల్య కారు రివర్స్‌చేసి వెనక్కు తిప్పేసింది.

కారు వెళ్ళిపోవటంతో జయంతి మళ్ళీ వచ్చి సీటులో కూలబడింది. ఆఫీసులో ఒకళ్ళిద్దరు తప్ప మిగతా అందరూ వెళ్ళిపోయారు. సారథి ఉన్నంతసేపు బాగానే ఉండే ఆఫీసు అతను వెళ్ళిపోగానే విసుగ్గా అన్పించ సాగింది. మేటర్ టైప్‌చేస్తున్నా జయంతి ఆలోచనలు కారువెంట పరుగెత్త సాగాయి.

సారథి చాలా అదృష్టవంతుడు. చిన్న వయస్సు పెద్ద హోదా! అందమయిన భార్య. అందరిలో సగర్వంగా, ఠీవిగా చొచ్చుకుపోయే బదులు, తప్పుచేసినవాడిలా, అర్హతలేనివాడిలా నెమ్మదిగా నిదానంగా ఎందుకుంటాడో అర్థంకాదు.

జయంతి కూర్చున్న గదికి మరోరెండుగదుల అవతలకిటికీ దగ్గరగా నిలబడ్డ మరోవ్యక్తి మనసుకూడా సారథితోపాటే వెళ్ళింది. అతను శివరామ్! కొత్తగా క్లర్కుగా వచ్చాడు. శివరామ్ శివరామ్ సారథి కలిసి ఇంటర్ చదివారు. అప్పుడు దాదాపు సారథి పరిస్థితులు శివరామ్ పరిస్థితులు ఒకటిగానే వుండేవి.ఇంటర్ పాసయింతర్వాత సారథి అమూల్యని పెళ్ళిచేసుకుని ఇల్లరికం వెళ్ళిపోయి బి. ఏ. పాసయి ఐ. ఏ. యస్. కి వెళ్లాడు. మామగారి పలుకుబడితో మంచి ఉద్యోగం వచ్చింది. ఆర్థిక పరిస్థితులు సరిగ్గాలేని శివరామ్ బి. ఏ. తప్పి ఉద్యోగం కోసం విసిగి వేసారి చివరికీ ఆఫీసుకు వచ్చాడు. సారథిని గుర్తుపట్టిన శివరామ్‌కి ఉదోగ్యం చెయ్యటం యిష్టంలేదు. కాని తప్పదు. దొరక్క దొరక్క దొరికిన ఉద్యోగం! ఆత్మాభిమానం అనుకుంటే ఇంటిదగ్గర తల్లి యిద్దరు చెల్లెళ్ళు పస్తులు పడుకోవాలి. శివరామ్‌కి సారథిలో లేని చురుకుదనం వుంది. తెలివితేటలున్నాయి. కాని అదృష్టం లేదు. చేతిలోవున్న సిగరెట్‌ని అవతల పారేసివచ్చి సీటులో కూలబడి అర్జెంట్ అని వున్న ఫైల్స్ తీసి రాయసాగాడు.

o o o o

మర్నాడు ఉదయం నుంచి మబ్బుపట్టిచలిగాలి వేస్తోంది సన్నగా వర్షపు చినుకులు రాల్తున్నాయి. సారథి 10-30 కే వచ్చి ఆఫీసులో కూర్చున్నాడు. ఈ యీదురు గాలి-వాన చూస్తుంటే జయంతి రాదేమో అన్పించింది. రాకపోతేనేనయం. జయంతి గుర్తువచ్చినప్పుడల్లా అతనికేదో

బాధనిపిస్తోంది. సారథి అసలు ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యటం అంటేనే యిష్టంలేదు. అందులో ఒక విధంగా స్కూలులోను, డాక్టర్లుగా వుంటే ఫర్వా లేదుగాని ఇలా ఆఫీసులో గుమస్తాలుగా టైపిస్టులుగా చేసేది అసలే యిష్టంలేదు. జయంతినికూడా అతని జన్మలో తీసుకునేవాడు కాదుగాని, బి.ఏ. చదువుతుండగా తనంటే విపరీతమైన అభిమానం చూపే లెక్చరర్ ఒకాయన గట్టిగా సిఫార్సు చేస్తూ ఉత్తరంరాశాడు; స్వయంగా వచ్చి చెప్పాడుకూడా. జయంతి ఉద్యోగంలో చేరిగూడా దగ్గర దగ్గర ఆర్నెల్లు అవుతోంది. తన ఆఫీసులో యెలాటి గొడవలూ లేవు. టైమ్‌కు వచ్చి తన పని చూసుకుని తల వంచుకుని టైమ్‌కు ఇంటికి వెళ్ళిపోయే జయంతి లాటి వాళ్ళతో, పెట్టుకుందామన్నా, సృష్టిద్దామన్నా యెలాటి సమస్యలూ రావు అని సారథి గ్రహించాడు.

స్ప్రింగ్‌డోర్ కదిలిన చప్పుడు విన్పించటంతో సారథి ఆత్రంగా గుమ్మంవయిపు చూశాడు. వెంటనే అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి. వచ్చింది జయంతికాదు శేఖరం! "పీడ! వెధవ, వాడంటేనే నాకు అసహ్యం!" రెయిన్‌కోటు విప్పి అక్కడున్న కుర్చీకి తగిలిస్తూఅన్నాడు శేఖరం. శేఖరం సారథికి బాగా పరిచయం ఉన్నవాళ్ళలో ఒకడు. కుబేరపుత్రుడయిన శేఖరానికి ఉద్యోగం చేయాలన్న బాధలేదు. అతను కాలక్షేపంకోసం చేసే బిజినెస్‌గూడా మంచిమంచి లాభాలు తెచ్చి పెట్టూంటుంది. "యేమిటో సీరియస్‌గా రాస్తున్నావల్లేవుందే! పారడైజ్‌లో మంచి పిక్చరుంది. మన ముగ్గురికీ సీట్సు రిజర్వ్ చేయించాను" సిగరెట్టుపెట్టె తీసి సారథిని తీసుకోమని చేయిచాచి అన్నాడు. శేఖరం పనే అంత. సరదాగా వ్యాపారం చెయ్యటం, రాత్రిళ్ళు నిద్రపట్టకపోతే క్లబ్బులో పొద్దుపోయేవరకు డబ్బుపెట్టి పేకాడడం. శేఖరానికి నిద్ర రానప్పుడు పేకాడడం యెదుటవాళ్ళకి మంచిలాభం. ఓడిపోయినా గెల్చినా డబ్బు యెదుట వాళ్ళకే వస్తుంది.

"ఇంటికెళితే అమూల్య ఆఫీసు కెళ్ళావని చెప్పింది. ఆదివారం

గూడా ఏం ఆఫీసు?" సిగరెట్ వెలిగిస్తూ వెనక్కు జారగిలబడుతూ అన్నాడు తాపీగా రాజశేఖరం.

సారధి చూపులు మాటిమాటికీ వెళ్ళి గుమ్మంమీద నిలుస్తున్నాయి. జయంతి రాకుండావుంటే బాగుండు. వచ్చినా శేఖరం వూరుకోడు; బల వంతంగా తనని సినిమాకు లాక్కెళ్ళాడు.

"ఏమిటి మాటిమాటికి గుమ్మంవయిపు చూస్తావు? ఎవరన్నా వస్తారా?" శేఖరం సారధి మొహంలోకి చూస్తూ అడిగాడు.

ఏమయినాసరే! ఈ రోజు జయంతిని నిరుత్సాహ పరచగూడదు. తను సినిమాకెళ్ళడు. ఆ అమ్మాయి పాపం, అంతదూరంనుంచి తన మాటమీద వచ్చి తిరిగి వెళ్ళిపోగూడదు సారధికి ధైర్యంలాటిది వచ్చింది. హఠాత్తుగా తలెత్తుతూ "శేఖరం! సారీ నేను రాలేను. అమూల్యా నువ్వు కలిసి వెళ్ళండి. నాకు అర్జంట్ రిపోర్టు ఒకటి గవర్నమెంటుకి పంపే పనుంది. ప్లీజ్, నువ్వు వెళ్ళు" అని సీరియస్‌గా రాసుకోవటంలో మునిగిపోయాడు. అతని వాలకం చూస్తే శేఖరానికి తను అక్కడ కూర్చొనటం గూడా డిస్టర్బెన్సేమో అనిపించింది. రెండు నిమిషాలు ఆగి లేస్తూ "ఆల్ రైట్! ఓ.కె. నాకేమీ అభ్యంతరం లేదు. కాని అమూల్యా-"

"నేను తర్వాత చెప్తాను" రాసుకుంటూనే కట్ చేశాడు సారధి.

"సరే." కుర్చీమీద పడేసిన రెయిన్‌కోటు తీసి తన చేతిమీద వేసుకుని వెడతానని చెప్పి బయటకొచ్చేశాడు. అమూల్యతో తను ఒక్కడూ వెళ్ళటం శేఖరాని కేమాత్రం యిష్టంలేదు. ఆ అయిష్టం అతని మొహంలో కనుబొమలు ముడిపడేలా చేసింది. కనుబొమలు ముడుచుకుని పర ధ్యాసగా స్ప్రింగ్‌డోరు తెరిచి బయటకు రాబోయిన శేఖరం ఎదురుగా తలవంచుకు వస్తూ వానచినుకులకి శరీరానికి అతుక్కుపోయిన చీరెని సరిచేసుకుని వస్తున్న జయంతికి డాష్ యివ్వబోయి ఆగిపోయాడు. దాదాపు అతని గుండెలవరకూ వచ్చిన జయంతి హఠాతుగా నిలదొక్కుకుని ఆగబోయి వెనక్కు పడబోయింది. ఇంతలో శేఖరం చేయిచాచి బలంగా పట్టుకుని ఆపాడు. క్షణంసేపు ఇద్దరికళ్ళూ కలుసుకున్నాయి. ఒకళ్ళని ఒకళ్ళు పరీక్షగా చూసుకున్నారు వానచినుకులకి చీర మెత్తగా

అయిపోయి వంటికి పట్టుకు పోయింది. మొహంమీద ఒకటి రెండు ముంగురులు నుదుటికి వుంగరాల్లా అతుక్కు పోయినాయి. బుగ్గలమీద, గడ్డంమీద ఇంకా వానతాలూకు తడి స్పష్టంగా కన్పిస్తోంది. బద్ధకంగా, విసుగ్గావున్న శేఖరం కళ్ళకి సౌందర్యానికిమారు పేరులా మలచినశిల్పంలా ఉన్న ఈ రూపం హాయిగా అన్పించి మరింత ఆసక్తితో పరీక్షగా చూసేలా చేసింది.

"సారీ!" కళ్ళు క్రిందకి వాలిపోగా అంది జయంతి.

"నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను!" యీ లోకంలోకి వస్తూ అన్నాడు శేఖరం, తప్పుకుని ప్రక్కకు తొలిగి దారియిస్తూ. జయంతి లోపలికి వెళ్ళిపోయింది. శేఖరానికి ఆమె వెంటనే మళ్ళీ వెనక్కు వెళ్ళాలనిపించింది. కాని, ఛీ! సారథి విసుక్కోవచ్చు. సభ్యతమాట గుర్తొచ్చిన శేఖరం ఆ కోర్కెని బలవంతంగా అణుచుకుని వెళ్ళిపోయాడు.

రెండు గంటలు అని చెప్పిన సారథి నాలుగు గంటలు డిక్టేట్ చేశాడు. డిక్టేట్ చెయ్యటం పూర్తయిం తర్వాత రంగయ్యచేత కాఫీ, టిఫిన్ తెప్పించాడు. టిఫిన్ తింటున్నా, కాఫీ తాగుతున్నా, టైప్ చేస్తూన్నా జయంతి కళ్ళ ముందు తెల్లగా, పొడుగ్గా వుండి, ఓ చేతిమీద రైన్‌కోటు వేసుకున్న 'అతని' రూపమే కదులుతోంది. అతనెవరో జయంతికి తెలియదు. కాని అతని రూపం మటుకు తను ఇప్పట్లో మర్చిపోలేదు.

జయంతి టైప్ చెయ్యటం పూర్తయిపోతుండగా గదిలో అటుఇటు తిరుగుతున్న సారథి కిటికీ దగ్గర కెళ్ళి బయటకు చూస్తూ "వాన తగ్గిపోయింది" అన్నాడు. తగ్గకపోయినా పర్వాలేదు. ఇంటికెళ్ళేటప్పుడు తడిసినా, చీర వొంటికి అతుక్కుపోయినా ఇబ్బందిలేదు అనుకుంది.

టైప్ చెయ్యటం పూర్తికాగానే కాగితాల్ని తీసి జాగ్రత్తగా దొంతిగా పెట్టి సారధికిచ్చేసి వెడుతున్నానని చెప్పిన జయంతి బయట కొచ్చేసింది.

"ఆగండి, నేనూ వస్తున్నాను. మిమ్మల్ని డ్రాప్ చేస్తాను." వెనుక నుంచి గబగబా వస్తూ అన్నాడు సారథి.

జయంతి తెల్లబోయింది

ఆ రోజు సారధి అలా తీసుకు వెళ్ళటం ధైర్యంచేశాడనే చెప్పాలి. కాని పైనుంచి ఈ ఇద్దరూ కార్లో వెడుతున్నారన్న సంగతి ఒక వ్యక్తి గమనిస్తున్నాడని, తమవైపు యీర్ష్యగా చూస్తున్నాడని యిద్దరిలో యెవరూ గమనించలేదు.

ం ం ం

పై సంఘటన జరిగిపోయి రెండు మూడు నెలలు అయింది. ఒక రోజు సాయంత్రం శేఖరం అమూల్య వాళ్ళింటికి వచ్చేసరికి హాల్లో భార్యాభర్తలిద్దరూ మొహాలు గంటుపెట్టుకుని కూర్చున్నారు. శేఖరాని కిదేదో రాగూడని సమయమే అన్పించింది.

"హలో! రేపు క్రికెట్ మాచ్‌కి...." శేఖరంవాక్యంపూ రిచెయ్యనేలేదు.

"నేను రాను, నాకు పనుంది." సారధి విసురుగా అని లేచి పొయాడు.

శేఖరం అమూల్యవైపు ప్రశ్నార్థకంగా చూశాడు. యెప్పుడూ నెమ్మదిగా ఉండి ఎంతసేపూ ఎదుటవాళ్ళు యేది చేస్తే దానితో ఏకీభవించే సారధి, ఇంటికెవరయినా వస్తే నమ్రతగా మాట్లాడి యెంతో మర్యాద చేసే సారధికి ఈ రోజు ఏమైందసలు?

శేఖరం మొహంలో ప్రశ్నార్థకం చూసిన అమూల్య సమాధానంగా ప్రక్కనే పుస్తకంలో వున్న చిన్న కవరు తీసి శేఖరంవైపు పడేసింది.

తన మీద పడి క్రింద పడబోయిన కవరుని శేఖరం ఆత్రంగా తీసి చూశాడు. అందులోవున్న చిన్నకాగితం మీద నాలుగే నాలుగు వాక్యాలున్నాయి. అది ఉత్తరంఅనటానికి గూడా వీల్లేదు. సంబోధనగాని, చివర సంతకంగాని లేని ఉత్తరం. అందులో ఇలా ఉంది:

"ఆఫీసులో లేడి క్లర్కుతో మీ భర్తగారి సరససల్లాపాలు చూసే తీరిక మీకు లేదా? లేక చూడదలుచుకోలేదా? లేడి క్లర్కుని వెంట తీసుకుని చీకటి పడింతర్వాత ఆఫీసరుగారు ఊరు చివర తిరిగి రావటం యెవరూ మీకు తెలియజేయలేదులా ఉంది. మీరు కొంచెం కళ్ళు తెరిచి మీ వారి ప్రవర్తన అదుపులో పెట్టుకుంటే బాగుంటుంది."

ఒకటికి రెండుసార్లు చదివి శేఖరం ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం మిళితమైన మొహంతో ఆ క్తిగా అమూల్యవైపు చూశాడు. గోళ్ళని జాగ్రతగా షేపు వచ్చేలా కత్తిరించుకుంటున్న అమూల్య శేఖరం చూపులు గమనించి గూడా చూసీ చూడనట్టు ఊరుకుంది.

"ఇంకేదయినా అయితే నమ్మవచ్చునుగాని,సారధి విషయంలో-"

"ఏం-తనేమయినా దేవలోకంనుంచి దిగివచ్చిన మనిషా?" విసురుగా కట్ చేసింది అమూల్య.

"కాకపోవచ్చు. కాని ఇలా దిగజారే మనిషి మటుకుకాదు. ఇదేదో గిట్టనివాళ్ళు రాసిన విషయంలా వుంది."

"అయితే సంతోషించవలసిన విషయమే-" కొంచెం ఆగి అమూల్య "కాని సారధిలో యిదివరకెన్నడూ లేని మార్పు ఒకటి కన్పిస్తోంది" అంది.

"ఏమిటది?"

"నాకు తెలిసినంతవరకు అతనిప్పుడున్నంత చురుకుగా ఎప్పుడూ లేడు" అంది.

శేఖరం బిగ్గరగా నవ్వాడు. "అదా! కొంతమందికి వయసు జారిపోతుంటే ఆగిపోతున్న యవ్వనం మరోసారి వెలుగుతుంది. అంతకంటే ఏం లేదు."

"ఏమో! మగవాళ్ళని నమ్మేదెలా!"

"అనుభవపూర్వకంగా అంటున్న మాట అనుకోవచ్చా!"

చురుగ్గా శేఖరంవైపు చూసిన అమూల్య సంభాషణ క్రికెట్ మాచ్ మీదకు మళ్ళించేసింది. తన మాటల్ని ఎదుటివాళ్ళు ఎలా తీసుకుంటారో ఆలోచించే స్వభావంలేని శేఖరం ఏ మాటనయినా సూటిగా విసిరెయ్యగలడు.

శేఖరం రాగానే హఠాత్తుగా తేచి వచ్చేసిన సారధికి ఆ రోజంతా మనసు యెలాగో వుండిపోయింది. అమూల్య పేరిట వచ్చిన ఆ ఉత్తరం శివరామ్ రాసిందని స్పష్టంగా తెలుసు. సంవత్సరాలు దొర్లిపోయినా శివరామ్ చేతివ్రాత సారధి మర్చిపోలేదు. చదువుకునేరోజుల్లో కాలేజీలో

భాస్కరం అనే అతను రాసినట్టు ఓ అమ్మాయికి ప్రేమలేఖ రాశాడు. అది ప్రిన్సిపాల్ వరకు వెళ్ళి దస్తూరి గుర్తుపట్టి నానా గొడవైంది. శివరామ్ గుర్తురాగానే సారథి మొట్టమొదటి ఆలోచన అతన్ని ఉద్యోగం లోంచి తీసెయ్యాలని. కాని ఎలా? పని విషయంలో అతన్ని ఎటువైపు నుంచి యెవరూ వంక పెట్టలేరు. కాని టైమ్ తీసుకున్నా సాధ్యమైనంత త్వరలో అతన్ని తీసెయ్యటం ఖాయం. ఒక విధంగా మనశ్శాంతిగా వుంది. తెలియనీ! అమూల్యకి మెల్లిగా తెలియటమే మంచిదేమో! కాని తను జాగ్రత్తగా ఉండాలి. సారథి జయంతి పరిచయాన్ని రహస్యంగా ఉంచుకునేందుకే నిర్ణయించుకున్నాడు రోజులు గడిచిపోతున్నాయి. జయంతిని ఒంటరిగా దూరంగా ఎక్కడికయినా ఓగంటపాటు తీసుకెళ్ళాలని బలంగా అనిపిస్తున్నా, ఉత్తరం మాట గుర్తుకు వచ్చి సారథికి ధైర్యం చాలటం లేదు. అమూల్య హఠాత్తుగా ఏదో పని పెట్టుకుని అప్పుడప్పుడు ఆఫీసుకు వస్తోంది ఆఫీసులో గూడా సారథి జాగ్రత్తగానే వుండాల్సి వస్తోంది. సారథిలో రేగుతున్నా ఈ గాలి దుమారం ఏ మాత్రం గూడా యెరగని జయంతి తన పనేదో తను చూసుకుని తనదారిని తను వెళ్ళిపోతోంది.

ఆ రోజు ఆఫీసునుంచి మామూలుకంటె గంట ముందుగా వెళ్ళిపోడానికి పర్మిషన్ అడిగింది.

"ఎందుకు?" జయంతి వైపు పరీక్షగా చూస్తూ అడిగాడు.

"సినిమాకి!"

"ఎవరితో?"

జయంతికి నవ్వొచ్చింది. "సుందరీ నేనూ కలసి వెడుతున్నాం!"

"ఏ సినిమాకి?"

ఈసారి జయంతి మొహం సీరియస్‌గా మారింది.

ఆఫీసర్ల తత్వమే అంత కాబోలు!

"బెన్‌హర్ కి."

"ఇంతవరకూ చూడలేదా?"

ఎంత అనవసరమైన ప్రసంగం! "చూశాను. కాని హీరో నా కిష్టం."

"ఏమిటో ప్రత్యేకత?"

జయంతి వెనక్కి తిరిగి తన డెస్క్ దగ్గరకు వెళ్ళిపోయింది. సారధి పర్మిషన్ లెటర్ మీద సంతకం చేశాడు.

"నిజమే! ఏమిటి ప్రత్యేకత!" జయంతి తనని తను ప్రశ్నించు కుంది. జవాబు దొరకలేదు. కాని ఏమయినా సరిగ్గా సమాధానం చెప్పి ఉండాల్సింది. "పొడుగాటి మనిషి కాబట్టి" అని చెప్పాల్సింది. సారధి పొట్టి. జయంతి కంటె మహా రెండు అంగుళాలు ఎక్కువ వుండవచ్చు. అంతే. "ఏమనుకోకు, ఊరికే అడిగాను." జయంతి వెళ్ళిపోతుండగా అన్నాడు సారధి. జయంతి సమాధానంగా నవ్వి వెళ్ళిపోయింది. "మీరు" "నువ్వు"లోకి దిగింది. జయంతి కెందుకో ఆ చనువు అసహ్యం అన్పిం చింది. జయంతికి సినిమా థియేటర్‌నుంచి ఒంటరిగా బయటకురావడం తోనే సారధి కన్పించటం చాలా ఆశ్చర్యమనిపించింది.

"నీ స్నేహితురాలేదీ?" జయంతితో సుందరిగాక యింకెవయినా వచ్చారేమోనని చూస్తూ అనుమానంగా అడిగాడు సారధి.

"రాలేదు, సరాసరి ఆఫీసునుంచి థియేటర్ దగ్గరకు వచ్చి కలుసుకోవాలనుకున్నాం. ఎందుకు రాలేదో మరి?" చుట్టూ చూస్తూ అంది జయంతి —తెలిసిన వాళ్ళెవరయినా ఉండి చూస్తే సారధి, తను కలిసి వచ్చారనుకుంటారేమోనని భయపడుతూ.

"నీ కభ్యంతరం లేకపోతే నేను డ్రాప్‌చేస్తాను" అన్నాడు సారధి.

జయంతి టైం చూసుకుంది. 9-30 దాటిపోతోంది. 3 బస్సులు మారాలి. కారులో అయితే పదినిముషాల్లో యింటికి వెళ్ళిపోవచ్చు. ఆఫీసు నుంచి సరాసరి రావడంతో బాగా ఆకలి కూడా అవుతోంది. జయంతి కారులో వెనకకు కూర్చోబోతుండగా సారధి వారిస్తూ ముందుకు వచ్చి కూర్చోమన్నాడు. జయంతి వచ్చి కూర్చుంది.

సారధి డ్రయివ్ చెయ్యటం మొదలుపెట్టాడు.

"థియేటర్ దగ్గరికి యెందుకు వచ్చానో అడగవేం?" సారధి ప్రశ్నించాడు.

"నా కెలా తెలుస్తుంది? మీరిక్కడ ఏదయినా పనిమీద వచ్చా రేమో అనుకున్నాను." ఆవలిస్తూ అంది జయంతి.

"లేదు. నీ కోసమే వచ్చాను...నా కెందుకో భలే యీర్ష్య అన్పించింది."

"ఈర్ష్యా!" అర్థంకానట్టు అడిగింది.

"నువ్వు...నువ్వు ఇంకెవరయినా కలిసి..."

"ఛ-ఛ—నాకు అలవాటులేదు. అరె, మా ఇల్లు యిటు కాదు." మధ్యలో అంది జయంతి.

"కాదని నాకు తెలుసు. కొంచెం అలా వెళ్ళివద్దాం. నీ కెలాంటి ప్రమాదం రానివ్వనని భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను."

జయంతి కేం చెప్పాలో తోచలేదు.

"జయంతీ! చెపితే నువ్వు నమ్మవు నీతో కొంచెంసేపు మాట్లాడితే నాకేదో పెద రిలీఫ్‌గా అన్పిసుంది.

"ఎన్నిరోజులనుంచి నీతోఇలా సన్నిహితంగా వొంటరిగా మాట్లాడే అవకాశం దొరుకుతుందా అని చూస్తున్నానో ఆభగవంతుడికే తెలుసు'

మాటలు రానిదానిలా వింటూ కూర్చుండిపోయింది జయంతి. కారు హిమాయత్‌సాగర్ రోడ్డు పట్టింది కిటికీ లోంచి చల్లటిగాలి వీస్తోంది. అక్కడక్కడా దూరంగా మినుకు మినుకు మంటున్న లైట్లు, గంద్రగోళంగా ఎప్పుడు చూసినా గలభాగా ఉండే సిటీకి దూరంగా వంటరిగా ఉన్న ఈ వాతావరణం హాయిగా ప్రశాంతంగా ఉంది. సారథి చెప్పే మాటలు పూర్తిగా వినని జయంతి కొత్తగా కన్పిస్తున్న వాతావరణాన్ని చూస్తూ కూర్చుండిపోయింది సారథి గూడా మాట్లాడటం మానేశాడు కొంచెం సేపయింతర్వాత సారథి తనే "ఏదయినా చెప్పు" అన్నాడు.

"ఏం చెప్పను?" అమాయకంగా అడిగింది జయంతి.

"ఏదయినాసరే మాట్లాడు. మూగదానిలా నిశ్శబ్దంగా కూర్చోకు."

జయంతి మాట్లాడలేదు.

"నీ చిన్నతనం గురించి ఏదయినా చెప్పు"అన్నాడుసారథి.జయంతి బుగ్గల్లోకిరక్తం పొంగింది. "చిన్నతనం ప్రత్యేకంగా గుర్తుపెట్టుకో తగినంత గొప్ప జీవితం కాదు నాది"

"గొప్ప జీవితం అంటే?" సారథి మధ్యలోనే రెట్టించాడు. అతని కాఫళంగా జయంతిని తీసుకొని ఎక్కడికయినా దూరంగా పారిపోవాలని పిస్తున్నది. ఈరోజే తనను తను గుర్తించుకున్నట్టు తోచింది.

"గొప్ప జీవితాలంటూ ఏమీలేవు జయంతీ! అన్నీ ఒకటే! కాని పరిసరాలు కొన్ని జీవితాలకి ప్రత్యేకతని ప్రసాదిస్తాయి, అంతే!" సారథికి హఠాత్తుగా కారు ఆపి జయంతిని దగ్గరకు తీసుకోవాలనిపించింది. కాని నిగ్రహించుకున్నాడు. అతనికి రోజు జీవితం అంటే ఏమిటో స్పష్టంగా తెలుస్తోంది. ఈరోజే గాదు. జయంతి మొట్టమొదట ఆఫీసులో అడుగు పెట్టినప్పుడే తెలిసింది. అమూల్యని చేసుకుని తను డబ్బు, సంఘంలో హోదా, సాటివాళ్ళలో పరువు ప్రతిష్ఠలు పొందగలిగాడు కాని, ఆ పొందటం కోసం తనజీవితంలో ఎంత విలువయింది పణంగా పెట్టాడోయిప్పుడు అర్థం అవుతోంది. ఒకదాన్ని పొందటం కోసం యింకోటి పోగొట్టుకున్న మనిషి తను. జయంతి పరిచయం సారథికి తను పొందినదానికంటె పోగొట్టుకున్నదే ఎక్కువ అని తెలియజేస్తోంది. తనకన్నీ వున్నట్టు అన్పిస్తుంది. కాని స్వతంత్రం ఏది? అమూల్య అంగీకారం లేందే తను యే ఒక్క చిన్న పనయినా చెయ్యగలడా?

"వాన వచ్చేట్టుంది" ఆలోచనల మధ్య కొట్టుకుపోతున్న సారథిని జయంతి కంఠం యీ లోకంలోకి తెచ్చింది.

అవును-గాలిలో చల్లదనంతోపాటు తేమగూడా తెలుస్తూంది.

"భయమా!" జయంతివైపు తలతిప్పి చూస్తూ అడిగాడు.

"చాలా దూరం వచ్చేస్తున్నాం" మనసులో కలిగిన భయాన్ని దాచుకోటానికి ప్రయత్నిస్తూ అంది. జయంతి కళ్ళకెందుకో సారథి వయసు 2 సం॥ తగ్గినట్టు అన్పిస్తోంది.

"పర్వాలేదు. నీకేం జరక్కుండా యింటికి జేర్చే బాధ్యత నాది. అని చెప్పలేదూ?" కారుఆపి పూర్తిగా జయంతివైపు తిరుగుతూఅన్నాడు.

"వద్దు వద్దు. కారు ఆపవద్దు. వెళ్ళిపోదాం" ఖంగారుగా అంది జయంతి. తనిప్పుడు యిలా వచ్చివుండకూడదు. తెలియకుండా అనాలోచితంగా వచ్చినందుకు భగవాన్! నాకెలాటి శాస్తీ చెయ్యకు. ఇంకెప్పుడు

ఇలా వంటరిగా రాను—జయంతి మనసులో భగవంతుడ్ని ప్రార్థించ సాగింది. గాలి వేగం ఎక్కువయింది. టపటప చినుకులు రాలటం మొదలుపెట్టాయి. క్షణంలో కాటుకలా చీకటి ఆవరించుకుంది. దూరంగా ఆకాశంలో వుండి వుండి మెరుపులు కన్పిస్తున్నాయి. వాన జోరుగా ప్రారంభమైంది. స్టీరింగ్ మీద మోచెయ్యి ఆన్చుకుని అరచేతిలో గడ్డం పెట్టుకుని సారధి వానవైపు చూస్తుండిపోయాడు.

"వెళ్ళిపోదాం, ప్లీజ్!" నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టుగా అంది జయంతి. సారధి సంస్కారపూరితమైన హృదయంమీద వున్న నమ్మకం సడలిపోయింది. శరీరంలో ప్రతినరం భయంతో బిగుసుకుపోసాగింది. తనిప్పుడు యిలా యింత రాత్రప్పుడు వచ్చి వుండకూడదు.

భయంతో ముడుచుకుపోయిన జయంతిని క్షణంసేపు పరిశీలనగా చూసిన సారధి తాకాలనిపించినా తాకకుండానే "భయపడకు, నాకెలాగో అన్పిస్తోంది. ఇదిగో, స్టార్టు చేస్తూన్నా" అన్నాడు స్టార్టు చేస్తూ గాలిలో బలం, వానజోరు రెట్టింపయినాయి. కారుముందు ప్రసరిస్తున్న హెడ్‌లైట్ల కాంతి పడ్డమేరకు వర్షపుధారలు పూసల తోరణాల్లా మెరుస్తున్నాయి.

సారధి హఠాత్తుగా చెయిజాపుతూ "జయంతీ! నీకేదో చాలా చెప్పాలనిపించింది. నువ్వనవసరంగా భయపడుతున్నావు" అన్నాడు.

"ఇప్పుడొద్దు, ఇంకోసారి యెప్పుడయినా—"

"కాని జయంతీ...." కుడిచేతితో డ్రైవ్‌చేస్తున్న సారథి ఎడం చెయ్యి చాచి జయంతి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అప్పుడే మలుపు వచ్చింది. గబుక్కున మలుపుతిప్పిన సారధి స్టీరింగ్‌ని కంట్రోలు చెయ్యటంకోసం రెండో చేతినికూడా గబుక్కున తీసుకోబోయాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది; అవతలనుంచి వేగంగా వస్తున్న కారు ఒకటి బలంగా ఢీకొట్టుకోబోయి సడన్‌బ్రేకుతో యెగిరి ప్రక్కనున్న చెట్టుని రాచుకుని కీచుమంటూ ఆగిపోయింది. హఠాత్తుగా ప్రమాదం తప్పించడం కోసం ప్రక్కకు తిప్పేసిన సారధి స్టీరింగ్‌ని కంట్రోలు చెయ్యలేకపోవటంతో ప్రక్కకు తిరిగిపోయి మరోచెట్టుని బలంగా గుద్దుకుంది.

"మైగాడ్! ఈ వెధవ్వానలో—" అవతల కారులోంచి కాస్తలో ప్రమాదం తప్పించుకున్న వ్యక్తి యివతలకు దిగి యీ కారువైపు పరుగెత్తుకొచ్చాడు. అతను కారును చేరకముందే రోడ్డుకడ్డంగా బోర్లాపడిన సారధి కన్పించాడు "పీడవాన! యెప్పుడూ ఏదో ఒకటి నా ప్రాణానికి తెస్తూనే వుంటుంది." తిట్టుకుంటూ సారధి మీదకు వంగి పరీక్ష చేయబోతుండగా సారథే ఒకసారి బలంగా మూలిగి ప్రక్కకు తిరగబోయాడు. "నయమే చచ్చిపోలేదు. అదృష్టం—" సారధికి ప్రక్కకు తిరగటానికి సాయంచేస్తూ అనుకున్నాడు.

"అబ్బా!" మరోసారి వెల్లకిలా తిరిగిన సారథి యింకోసారి మూలిగాడు.

"ఎవరూ! మైగాడ్! సారధి ఈవేళప్పుడు ఇక్కడేం చేస్తున్నట్లు!"

శేఖరం ఆశ్చర్యపోయి యింకోసారి పరీక్షచేయబోతుండగా సారథి లేచాడు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకి అతని మనసు దిమ్మెరపోయింది. అంతబలమైన దెబ్బలు తగల్లేదు.

"శేఖరం!" సారధి తెల్లబోతూ అన్నాడు.

"నీకంటె నేనే ఎక్కువ ఆశ్చర్యపోతున్నానని చెపుతున్నా. ఈ పాటికి భోంచేసి హాయిగా పరుపుమీద నిద్రపోవలసిన నువ్వు-"

శేఖరం వాక్యం పూర్తిచెయ్యకుండానే సారధి ఉలిక్కిపడినవాడిలా చుట్టూ చూస్తూ "జయంతి-జయంతేది?" అన్నాడు.

"జయంతా! ఎవరావిడ? నీకు పూర్తిగా స్పృహవచ్చినట్టులేదే?" అన్నాడు శేఖరం. గబుక్కున ముందుకువెళ్ళబోయిన సారథి కాలు పట్టుకుని "అబ్బా!" అంటూ ఆగిపోయాడు.

"ఏమైంది? దెబ్బ తగిలిందా?" శేఖరం ఆత్రంగా వంగి కాలు చూడబోతూ అన్నాడు.

"నా కాలు వదిలెయ్యి. నాతో కారులో యింకో అమ్మాయి వుంది-ఏది?"

"ఏది?" శేఖరంకూడా చుట్టూ చూస్తూ అడిగాడు.

"అటువైపు వెళ్ళి చూడు శేఖరం! త్వరగా. లాభంలేదు నా కాలు

కదలనివ్వటంలేదు" సారథి తొందర పెట్టాడు. శేఖరం కారు కటువైపు వెళ్ళాడు. వాన యింకా జోరుగానే పడుతోంది. ముందు శేఖరానికి వాన జల్లు తప్ప ఏం కన్పించలేదు. అతని కళ్ళు మరింత చురుకుతనం తెచ్చుకొని పరీక్షగా చూసింతర్వాత జయంతి కన్పించింది. చేతులు,తలమటుకు రోడ్డుమీదికి కొద్దిగా వున్నాయి. మిగతా భాగం క్రింద వుంది. రోడ్డుమీద పడే వర్షపునీరు కాల్వలుగట్టి ప్రవాహంలా జయంతిమీదనుంచి జరజర ప్రవహిస్తున్నాయి. అదృష్టం జయంతి ప్రక్కనే పెద్ద రాయి వుంది. ఆ రాయిమీద పడలేదు. ఇంకో విధంగా రాయి అక్కడే వుండటంవల్లనే జయంతి ఆ మాత్రం ఉండగలిగింది.

లేకపోతే వర్షపునీళ్ళు అడుగున పడి ఉనికి తెలిసేదికాదు.

శేఖరం రెండంగలలో వెళ్ళి జయంతిని చేతులమధ్య లేపేసి కారు దగ్గరకు తీసుకొచ్చేశాడు.

"స్పృహ వుందా?" సారథి ఆత్రంగా అడిగాడు.

"ఉన్నట్టులేదు." శేఖరం కనుబొమలు ముడిపడ్డాయి. ఇదన్నమాట, సారథి యిక్కడ వెలిగిస్తున్న ఘనకార్యం! జయంతి నుదురుమీద గాయం బలంగా వుంది. మోచేతి దగ్గర కూడా రక్తం వస్తోంది. పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి, జయంతి నుదుటికి అడ్డు పెట్టిన శేఖరం విసుగ్గా సారథివైపు చూస్తూ "నువ్విలా పట్టుకుని వెనక సీటులో కూర్చుంటే నేను డ్రైవ్ చేస్తాను. మనం సాధ్యమయినంత త్వరలో డాక్టర్ దగ్గరకు వెళ్ళటం మంచిది" అన్నాడు.

గబుక్కున యెక్కబోయిన సారథి చటుక్కున ఆగిపోయాడు. శేఖరం ఏమిటన్నట్టు చూశాడు.

"శేఖరం! నేను నీతో రాను. కారు దగ్గర వుండిపోతాను." అన్నాడు.

శేఖరం కళ్ళు వెడల్పయినాయి.

"నిజం. నేనిలా వచ్చాననిగాని-జయంతి నాతో వుందనిగాని ఎవరికీ-ముఖ్యంగా అమూల్యకి తెలియకూడదు."

కథా నిలయం
573
శ్రీకాకుళం

"అందుకని?" రెప్పవాల్చకుండా యింకా అలాగే చూస్తూ అడిగాడు శేఖరం.

"చెప్పానుగదా! జయంతిని తీసుకెళ్ళి నీకు తెలిసిన డాక్టర్ కెవరి కయినా చూపించు, నేనిక్కడే వుంటాను."

"ఆ కారు పాడయినట్టుంది, ఎలా వస్తావు?"

"ఆ సంగతంతా నాకు వదిలెయ్యి. తెల్లవార్లూ నేనిక్కడ కూర్చున్నా ఫర్వాలేదుఅదృష్టవశాత్తూ నీలాగే యెవరన్నా వస్తే చూస్తాను. తెల్లవారే లోపల కనీసం ఒక లారీ అయినా యిటు వెళ్ళకపోదు."

శేఖరం కనుబొమలు మరింత ముడుచుకున్నాయి.

"తీసుకెళ్ళటానికి నాకభ్యంతరంలేదు. కాని జేబురుమాలు అడ్డు పెట్టి గట్టిగా నొక్కి పెట్టకపోతే రక్తం మరింత పోతుంది" అన్నాడు.

"దానికి నేను ఉపాయం చెప్తానుగా." సారథి అలా కుంటుతూనే శేఖరం సాయంతో జయంతిని ముందు సీటులోకి తెచ్చాడు. జయంతి తల శేఖరం తొడమీద వుంటుంది. ఎదురుగుండా ఏ కారూ అడ్డురానంత వరకూ ఒక చెయ్యి జేబురుమాలుమీద వుంచి యింకోచేత్తో శేఖరం డ్రైవ్ చెయ్యొచ్చు అప్పుడప్పుడు కాస్త చెయ్యి తీసినంత మాత్రాన ఏం కాదు.

"సరే! కాని నే మళ్ళీ వెనక్కి వస్తాను. ఈలోపల నీ కే కారు దొరక్కపోతే." శేఖరం కారు స్టార్టు చెయ్యబోతూ అన్నాడు.

"ఆల్ రైట్! మర్చిపోయాను, ఆ సిగరెట్ పాకెట్ యిటు ఇచ్చి వెళ్ళు." సారథి శేఖరం పెట్టె మొత్తం తీసుకున్నాడు.

డ్రైవ్ చేస్తున్న శేఖరం చేతి వాచీ చూసుకున్నాడు. 12.30 ఇప్పుడే డాక్టర్ దగ్గరకెళ్ళాలి! తెలిసినవాళ్ళ దగ్గరకి వెళ్లేందుకు వీలులేదు ఇంతరాత్రప్పుడు. భగవాన్! ఈరోజు లేచి ఎవరి మొహం చూశాడో కాని. ఎలాటి గొడవలో యిరుక్కున్నాడు. తొడమీదనుంచి జారిపోతున్న జయంతితల సరిచేస్తూ అనుకున్నాడు అయితే ఆరోజురాసినఆకాశరామన్న ఉత్తరం నిజమేనన్నమాట. తను నమ్మనే నమ్మలేకపోయాడు. ఏం మను ష్యులు! భర్తవెనక భార్య! భార్య వెనక భర్త! ఛీ, యీ ఆఫీసులో ఉద్యోగం చేసే ఆడపిల్లలు మటుకు? వాళ్ళమటుకు ఏం చేస్తారు?

ఎలాగో అలాగు చదువుకోవడం-డిగ్రీ సంపాయించుకోవడం, ఉద్యోగాల్లో చేరటం. ఉద్యోగాల్లో చేరగానే ఏళ్ళు జరుగుతాయి. పెళ్ళి అశ్రద్ధఅయి పోతుంది. అవి వున్న మనిషి దొరకడు. ఈ లోపల సంవత్సరాలు దొర్లిపోవటం. ఎవరో కొద్దిగా మనసుకి దగ్గరగా రావటం! వాళ్ళతో సంబంధాలు యేర్పరచుకోవటం చేస్తారు. ఆ కాలంలో బాల్య వివాహాలు చేసేస్తే భర్తలుపోయి విధవరాండ్రుగా మిగిలిపోతే, యీ రోజుల్లో చదువుకుని పెళ్ళిళ్ళు కాకుండా మిస్సమ్మల్లాగా మిగిలిపోతున్నారు. ఆడ పిల్ల జీవితం అప్పుడెలా బాధగా ఉందో, ఇప్పుడూ అలాగే ఉంది. కాక పోతే తిండికోసం వాళ్ళు యెవరి మీదా ఆధారపడడం లేదు - అంతే.

కారు సిటీ సమీపిస్తోంది. ఇప్పుడు యే డాక్టర్ దగ్గిర కెళ్ళాలి? జయంతి తడితల పెట్టడంవల్ల శేఖరం పాంటుగూడా తడిసి పోయింది. వాన ఉధృతం కొద్దిగా తగ్గింది. ఈ రాత్రివేళ యిలా తన తొడమీద స్పృహ లేకుండా పడివున్న ఈ అమ్మాయి ముక్కు, మొహంకూడా తనకి తెలియదంటే యెవరయినా నమ్ముతారా? ఎవరూ నమ్మరు. అందుకే కొంచెం జాగ్రత్తగా, తనంటే తెలియని డాక్టరు దగ్గర కెళ్లాలి. శేఖరం కళ్ళముందు గబగబా డాక్టర్ల లిస్టు తిరిగింది. ఆ! పరాంజపే అని మహరాష్ట్రియన్. ఒకసారి ఎప్పుడో ఎందుకో అతని దగ్గర కెళ్ళాడు. అతని క్లినిక్, యిల్లు రెండూ ఒకచోటే! పెద్దవాడు గూడా! శేఖరం కారుని అటువయిపు తిప్పాడు.

శేఖరం అదృష్టం. పరాంజపే యింట్లోనే ఉన్నాడు.

కారు హారన్ నొక్కిన రెండు నిమిషాలకే తలుపు తెరచుకుంది. శేఖరం సాయంతో జయంతిని లోపలికి తీసుకెళ్ళి టేబిల్ మీద పడుకో పెట్టాడు.

డాక్టర్ జయంతిని పరీక్ష చేసి నుదుటమీద కట్టుకట్టి యింజక్షన్ చేశాడు.

"ఇప్పుడప్పుడే బహుశా మెలకువ రాదనుకుంటా!" జయంతివైపు పరీక్షగా చూసి శేఖరంతో అన్నాడు.

"అసలు మెలకువనేది రాకుండా ఉంటే సంతోషిస్తా" అనుకున్నాడు శేఖరం మనసులో కసిగా.

"మీకు పడక్కుర్చీ తెచ్చివేస్తాను మీరుకూడా అలసిపోయారులా ఉంది."

"నేనిక్కడుండి ఏం చెయ్యాలి? ఇంటికి వెళ్ళిపోతాను."

డాక్టర్ శేఖరం వయిపు చిత్రంగా చూశాడు.

"అదే.మెలకువ రాదంటున్నారు కదా!" శేఖరం సనిడిగాడు.

"వస్తే రావచ్చు. మీరు లేకపోతే ఆమె ఖంగారు పడవచ్చు!" డాక్టర్ వెళ్ళి పడక్కుర్చీ తెచ్చి వేశాడు. శేఖరం అందులో కూలబడ్డాడు. జయంతి తలపెట్టినంతమేరా అతని పాంటు యింకా బాగా చల్లగా ఉంది. వెధవగోల! తనీ గొడవలో చిక్కుకున్నాడేమిటి? శేఖరం ఆలోచన్లు హఠాత్తుగా జయంతి ఇంటివైపు తిరిగాయి. వాళ్ళు యేమనుకుని ఉంటారీపాటికి ఖర్మ! పోలీసు రిపోర్టు యివ్వరుగదా! లేకపోతే ఇలా రాత్రుళ్ళు ఇంటికి రాకపోవటం అలవాటేనేమో! శేఖరం మొహం మళ్ళీ కఠినంగా మారింది. ఆ రోజు తను సారథి గదిలోంచి వస్తుంటే దాదాపు తనమీద వచ్చి పడబోయి "సారీ" అన్న అమ్మాయేగదూ! ఆ రోజు తనెందుకంత ఇదిగా ఫీలయ్యాడు అమాయకంగా. ఆశ్చర్యంగా సూటిగా చూసే ఆ కళ్ళు తనకి చాలా రోజులు జ్ఞాపకం ఉన్నాయి—అన్న సంగతి శేఖరానికి గుర్తువచ్చింది. అది అమాయకత్వం యేమీగాదు. అదో పోజు లేకపోతే బుద్ధి లేదూ? పెళ్ళయిన మనిషితో యేమిటా సాంగత్యం! శేఖరం తల తిప్పి కోపంగా జయంతివైపు చూశాడు. అతనికి క్షణంలో జయంతిని జయంతి ఖర్మానికి వదిలేసి చక్కా పోవాలనిపించింది. మళ్ళీ అమాయకంగా, విపరీతంగా అలిసిపోయి గాఢ నిద్రలో వున్నదానిలా వున్న ఆ మొహం గుర్తుకొచ్చేసరికి శేఖరం మొహం మళ్ళా ప్రసన్నం అయింది.పాపం! తనుమటుకు ఏంచేయగలుగుతుంది! ఇంట్లో పెద్దవాళ్ళని అనాలి గాని - వయసుచేసే గమత్‌లను తప్పించుకోవటం యెవరితరం? నిండా 20 సంవత్సరాలయినా ఉన్నట్టులేదు. ఇంత చిన్న వయసులో అసలు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం రావడమే దురదృష్టం.

పడక్కుర్చీలో కాలుమీద కాలువేసుకుని వెనక్కువాలి జయంతి వైపే చూస్తున్న శేఖరం చూపులు చూస్తుండగానే రెప్పలు వాలిపోయి బరువుగా మూతలు పడిపోయినాయి.

ఎవరో పట్టి గట్టిగా కుదపటంతో శేఖరానికి మెలకువ వచ్చింది. క్షణంసేపు అతనికి తనెక్కడుంది అర్థంకాలేదు. కిటికీలోనుంచి తొలి వెలుగు రేఖలు గదిలోకి వస్తున్నాయి.

"ఆమెకు మెలకువ వచ్చింది మీరులేచి దగ్గరకు రండి. గుర్తు పట్టగలరేమో చూద్దాం." పరాంజపే అంటున్నాడు. శేఖరానికి మెల్లగా యాక్సిడెంట్, జయంతి తల తన తొడమీద పెట్టుకుని తీసుకురావటం, డాక్టర్ పరాంజపే తలుపు తీయటం మెల్లగా గుర్తువస్తున్నాయి.

"మీకే చెప్పేది-దగ్గరకు రండి."

శేఖరం నిద్రమత్తును వదిలించుకుని లేచి జయంతి దగ్గరగా వెళ్ళాడు. కళ్ళు తెరిచిన జయంతి యింకా యెక్కడో వున్నదానిలా మత్తుగాచూస్తూ "ఎక్కడున్నాను. యేమిటిది?" అంది నీరసంగా. డాక్టర్, శేఖర్ని ముందుకు తోశాడు. శేఖరం నవ్వాలనుకున్నాడు కాని నవ్వు రాలేదు.

"చెప్పండి ఏమిటిది?" జయంతి చప్పున లేచి కూర్చోబోయింది. డాక్టరు వెంటనే చేయిచాచి ఆపేశాడు. ఆ కొద్దిసేపట్లోనే జయంతి కప్పుకున్న దుప్పటి జారటం, ఆ వెంటనే డాక్టర్ సరిచెయ్యటం క్షణంలో జరిగిపోయినాయి. అది శేఖరందృష్టి దాటిపోలేదు. తను యీ అమ్మాయికి బట్టలు గూడా మార్చినట్టు గుర్తు వచ్చిన శేఖరం వెంటనే తల తిప్పేసుకుని చూపులు మార్చుకున్నాడు.

"తలెందుకు యింత నొప్పిగా వుంది?" చేత్తో తల తడుముకుంటూ అంది.

"తగ్గిపోతుంది." డాక్టర్ ఇంజక్షనిస్తూ అన్నాడు.

"మిమ్మల్ని గుర్తుపట్టలేదు. తమాషా! స్పృహ వచ్చింది మరి" బయటకొస్తూ అన్నాడు డాక్టర్. జయంతి తన్నెందుకు గుర్తుపట్టలేదో శేఖరానికి ఒక్కడికే తెలుసు.

"రాత్రి మీరు తియ్యటంలో ఆచీరె చించేశారు-అసలు అది పాతదిలా వుంది. ఇంకోటి తీసుకురండి."

శేఖరం అంత వుదాసీనంగా యెందుకున్నాడో డాక్టర్‌కి అర్థం గావటం లేదు.

డాక్టర్ ఆదేశించిన ప్రకారం శేఖరం చీర తెచ్చాడు. జీవితంలో ఏనాడూ చీరలు కొనని శేఖరం ఈరోజు రాత్రి అజాగ్రత్తగా జయంతి చీరతీసి చింపినందుకు ప్రతిఫలంగా కొత్తచీర కొనుక్కొచ్చాడు.

"ఇహ మీరు వెళ్ళచ్చు. పని చూసుకుని రండి. తలమీద దెబ్బ బలంగా తగిలింది. ఈరోజల్లా అలా లేవకుండా మత్తుగా వుంటేనే మంచిది" అన్నాడు.

శేఖరం సరేనని చెప్పి వెళ్ళిపోయాడు. "ఏం మనిషి? 'ప్రమాదం లేదు గదా! అని ఒక్కసారిగూడా అడగలేదు." డాక్టర్ చిత్రంగా చూశాడు. అంతేగాదు. జయంతిపట్ల అతని చూపుల్లోని విముఖత్వం, అతని పరధ్యాన డాక్టర్‌కి అనుమానం అన్పించేలా చేశాయి.

శేఖరం ఇంటికెళ్ళేసరికి 11 గంటలయింది. సారథి రెండుసార్లు ఫోన్ చేశాడనీ యింటికి రాగానే శేఖరాన్ని ఫోన్ చెయ్యమని చెప్పాడనీ నౌకరు చెప్పాడు.

శేఖరం ఆఫీసుకి సారథి కోసం ఫోన్ చేశాడు. శేఖరం కంఠం వింటూనే సారథి "ఆగు, ఫోన్‌లో ఏం మాట్లాడొద్దు. నేను వస్తాను. లేక పోతే నువ్వురా!" అన్నాడు.

"నేను రాలేను. నాకు ఓపికలేదు." విసుగ్గా అన్నాడు శేఖరం.

"ఆల్ రైట్. నేనే వస్తున్నాను."

మరో పది నిమిషాల్లో సారథి శేఖరం యెదురుగుండా ఉన్నాడు. శేఖరం జరిగిందంతా చెప్పాడు.

"వాళ్ళింటి దగ్గర ఏం గొడవ జరుగుతుందో?" సారథి అన్నాడు.

"అదే నాకు భయంగా వుంది. వాళ్ళేదయినా రిపోర్టు యిస్తే అనవస సరంగా నేనిందులో ఇరుక్కోవాల్సి వస్తుంది." కోపంగా అంటున్న శేఖరం వయిపు సారథి బాధగా చూశాడు.

ఇద్దరిమధ్య మౌనం ఆవరించింది.

"శేఖరం! ఇంత సాయం యెలాగూ చేశావు. ఇంకొకటి చెయ్యి కూడదూ?" అన్నాడు సారథి.

(5)

"ఏమిటది?" కుర్చీలో వెనక్కు జారగిలబడి సిగరెట్ కాలుస్తున్న శేఖరం అడిగాడు.

"సెక్రటేరియట్‌లో సుందరి అని యు.డి.సి.వుంది. ఆ అమ్మాయి జయంతి ఫ్రెండ్. కాస్త ఆ అమ్మాయిని కలిస్తే-"

"ఆ అమ్మాయి మొహం నాకు తెలియదు, నా ముక్కు మొహం ఆ అమ్మాయికి తెలియదు."

ఇంకోసారయితే సారధి నవ్వేవాడే. ఇప్పుడతను నవ్వే స్థితిలో లేడు. దాదాపు మతిపోయిన స్థితిలో ఉన్నాడు. శేఖరం వెళ్ళిపోయిన అర గంటకి అటువైపు లారీ వస్తుంటే అందులో వచ్చాడు. శేఖరం అమూల్యకి యాక్సిడెంటయిందని చెప్పాడు. కాని జయంతి, శేఖరం యివేం చెప్పలేదు. యాక్సిడెంటు ఎప్పుడయిందీ తెలియని అమూల్య మనుషుల్ని పిలిపించి కారుకోసం పంపింది. అప్పుడే కారు బాగయిపోతోంది కూడా. సారధికి రాత్రి కళ్ళు మూతపడితే ఒట్టు.

శేఖరం కన్పించి ఈ మాత్రం చెప్పిన తర్వాత అతని మనసు కుదుటపడింది.

"ఎలాగయినాసరే సుందరికి జయంతి విషయం తెలియటం మంచిది అన్న సంగతి నీకు తెలుసు."

"అదృష్టవంతుడివి. నన్నిందులోకి తోసి చక్కగా ఒడ్డున కూర్చున్నావు" అనుకున్నాడు శేఖరం.

సారధి సుందరి పనిచేసే సెక్షన్ చెప్పి సుందరితో ఎలా చెప్పాలో వివరించాడు. లేచి ఎళ్ళబోతూ "జయంతికి బాగా స్పృహ తెలిస్తే జరిగిం దానికి నేను చాలా బాధపడుతున్నానని చెప్పు" అని వెళ్ళిపోయాడు.

శేఖరం బట్టలు మార్చుకుని భోంచేసి వో అరగంట రెస్టు తీసుకుని మళ్ళీ సుందరికోసం బయలుదేరాడు.

"అర్జంట్। మీతో జయంతి విషయం మాట్లాడాలి జయంతి యాక్సిడెంటు అయి హాస్పటల్‌లోఉంది. ఒక్క రెండు నిమిషాలు బయటికి రండి."

సంతకంలేని చీటీని సుందరి తిరగేసి, బోర్లేసి మరీ మరీ చూసి యింకో రెండుసార్లు చదివింది. అయినా విషయం అర్థంగాలేదు. సూప

రింటెంట్‌కి ఓ అరగంట పర్మిషన్ కావాలని చెప్పి బయటకొచ్చింది. రాత్రి వానకురిసి వెలవటం వల్లనేమో ఈరోజు ఎండ తీక్షణంగా వుంది. ఆ ఎండలో పొడుగాటి కారులో శేఖరం కూర్చుని సుందరికోసం యెదురు చూస్తున్నాడు.

"మీరేనా సుందరి అంటే?" ప్యూన్ వెంటవస్తున్న సుందరివైపే చూస్తూ అన్నాడు. శేఖరాని కెందుకో సుందరి మొదటిచూపులోనే నచ్చింది. అంత పొడుగు, పొట్టీగాని విగ్రహం. ఓ మాదిరి లావు. చామనఛాయ, మొహాన గుండ్రటి బొట్టు, పల్చటి చీరెలోంచి స్పష్టంగా కన్పిస్తున్న మంగళసూత్రం. మర్యాద ఉట్టిపడే మొహం. తనవయిపు వస్తున్న శేఖరాన్ని చూసి సుందరి కంగారు పడింది. జరిగినదంతా శేఖరం క్లుప్తంగా 5 నిమిషాలలో చెప్పాడు. రెప్పవాల్చటం వూపిరి పీల్చటం మర్చిపోయి శేఖరం మొహంలోకి చూస్తూ అలాగే నిలబడి పోయింది సుందరి.

"మీరు వస్తానంటే తీసుకువెళ్తాను. సాధ్యమైనంత త్వరలో దయ యుంచి నా భుజాలమీదనుంచి ఈ భారం దిగాలంటే దానికి మీ రొక్కరే సమర్థులు." ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ గబగబా అన్నాడు శేఖరం.

"ఒక్క నిమిషం వుండండి. శెలవు పెట్టేసి వస్తాను." సుందరి మళ్ళీ ఆఫీసులోకి పరుగెత్తింది. చెప్పినట్టుగానే సుందరి బయటికొచ్చి శేఖరం కారులో కూర్చుంది.

ఇద్దరూ ఏం మాట్లాడలేదు. 15 నిమిషాలలో కారు డా॥పరాంజపే అని బోర్డున్న యింటిముందు వచ్చి ఆగింది. ఇద్దరూ దిగి లోపలికి వచ్చారు.

ముందు గదిలోనే ఎదురయిన డాక్టర్ శేఖరాన్ని పలకరిస్తూ, నర్స్ వచ్చిందనీ, పేషెంటుని పైకి మీదమీద గదిలోకి మార్చామనీ,ఫర్వాలేదు కులాసాగానే వుందనీ, కాఫీగూడా తాగింది ఇప్పుడే అనీ చెప్పాడు.

సుందరిని ఏమని పరిచయం చెయ్యాలో తెలియని శేఖరం జయంతి అక్క అని చెప్పాడు.

డాక్టర్ చూపించిన దోవని అనుసరిస్తూ సుందరి, శేఖరం మేడ మెట్లు ఎక్కారు. సుందరి ముందుగా నర్స్ చూపించిన గదివైపు పరు

గె తింది. శేఖరం బయట వరండాలో ఆగిపోయాడు. గుమ్మానికి ఆకు పచ్చటి కర్టెన్ వేళ్ళాడుతోంది.

"జయా!"

"సుందీ!" జయంతి బావురుమంది. సుందరి సముదాయిస్తోంది. పాంటు జేబులో సిగరెట్టు తీసుకుని వెలిగించుకుంటున్న శేఖరం తను సుందరి వెనక గదిలోకి వెళ్ళకపోవటం మంచిపని చేశాననుకున్నాడు.

"సుందీ! నేనసలు బ్రతికున్నానా?" జయంతి వెక్కి వెక్కి ఏడుస్తూ అడిగింది. శేఖరానికి నిజంగా జాలి అనిపించింది.

"ఫర్వాలేదు. ఇంకా అదృష్టవంతురాలివిగదూ?"

జయంతి తలని మెల్లగా దెబ్బకి కట్టినకట్టు కదలకుండా గుండె లకి దగ్గిరగా లాక్కుంటూ అంది సుందరి.

"నన్నిక్కడికి అసలు యెవరు తీసుకొచ్చారు? ఈ చీరెకూడా నాది కాదు."

"బహుశా డాక్టరిచ్చి వుంటాడులే- వానలో తడిశావుగదా?"

సుందరి కంఠం విన్పించింది. శేఖరం చేతిలో సిగరెట్ దూరంగా విసిరేసి క్రిందికి దిగి వచ్చేశాడు.

చాలా సేపయిన తర్వాత సుందరి దిగివచ్చింది. రాత్రికి అవసరం ఐతే శేఖరానికి ఫోన్ చెయ్యటం కోసం డాక్టర్ శేఖరం ఫోన్ నెంబరు తీసుకున్నాడు.

సుందరిని ఇంటిదగ్గరకు తీసుకొచ్చి వదిలేశాడు శేఖరం. దిగివెళ్ళి పోబోతున్న సుందరిని హఠాత్తుగా ఆపి, "మరి వాళ్ళయింటి దగ్గర...." అన్నాడు.

"అదంతా నేను చూసుకోగలను రేపు మటుకు మీరు శ్రమ అను కోక వచ్చి అక్కడికి తీసుకెడితే చాలు. ఆ సందులు గొందుల్లో ఆ డిస్పె న్సరీ గుర్తుపట్టటం కష్టం" అంది నవ్వుతూ.

"అబ్బే! రేపు సరిగ్గా ఈ టైముకు నేను వచ్చి తీసుకెడతాను. ఒక్కడ్ని అంటే భయమేస్తు దిగాని-పంచుకునేవాళ్ళుంటే యెంత బరు వయినా మోయగలను!" అతను నవ్వుతూ వీడ్కోలు తీసుకున్నాడు.

సుందరికి యింటిదగ్గర అత్త, మామ, కొడుకు ఉన్నారు. భర్త కూడా ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు. సుందరిని చూస్తుంటే యెలాటి వాళ్ళు కూడా తమ బాధలు మర్చిపోయి హాయిగా నవ్వేయగలరేమో అన్పించింది శేఖరానికి.

సారధికి సుందరి సంగతంతా చెప్పాలని యింటికెళ్లేసరికి యింటి దగ్గర యెవరూ లేరు. సారధి అమూల్య కలిసి యెక్కడో డిన్నరుందని వెళ్ళారుట! శేఖరానికి హఠాత్తుగా గుర్తుకువచ్చింది. లాయర్ ప్రేమ్‌చంద్ యింట్లో యీ పూట తనుకూడా తప్పనిసరిగా హాజరవ్వాల్సిన పార్టీ. బిజినెస్ దృష్ట్యా అది చాలా ముఖ్యమైంది కూడాను. శేఖరం వాచీ చూసుకున్నాడు. అప్పటికే చాలా టైమయిపోయింది. ఒళ్ళు మండిపోయిన శేఖరం సారధిని తిట్టుకుంటూ ఇంటికి వచ్చేశాడు.

మర్నాడు సుందరితోపాటు జయంతి బామ్మ, మరో 8 సంవత్సరాల ఆడపిల్ల ఉంది. ఆ పిల్ల జయంతి అక్కకూతురని, జయంతి అక్క ఈ పిల్ల పుట్టగానే పురుట్లోనే చనిపోయిందని, బావగారు యింకో పెళ్ళి చేసుకోవటంవల్ల అక్కకూతుర్ని తనదగ్గరే అట్టే పెట్టుకుందని చెప్పింది. కుటుంబం గడవటం జయంతి ఉద్యోగం మీదనే ఆధారపడి వుంది. 20 సం॥ నిండీ నిండనట్టున్న జయంతి త్వరత్వరగా చదువు ముగించుకుని ఉద్యోగంలో ఎందుకు ప్రవేశించిందీ శేఖరానికి ఇప్పుడు అర్థమైంది. అలాంటి పరిస్థితులలో బాధ్యత తెలియకుండా వొళ్ళు మరిచి సారధితో సాంగత్యం కలుపుకున్నందుకు మరుక్షణంలో ఒళ్ళు మండిపోయింది కూడా.

సుందరి, జయంతి బామ్మకి ఏమని చెప్పిందో ఆ భగవంతునికే తెలుసు! శేఖరం ఊహించినట్టు ఆవిడ జయంతిని చూస్తూనే గంద్రగోళం చెయ్యలేదు. కళ్ళంబడి నిశ్శబ్దంగా నీరు పెట్టుకుంది. భయపడవద్దని మనమరాలికి ధైర్యం చెప్పింది-అంతే!

సుందరి, బామ్మ, పాపతోపాటు లోపలికి వచ్చిన శేఖరాన్ని చూసి జయంతి తెల్లబోయింది. కళ్ళు వెడల్పు అయినాయి.

"మీరు-మీరు-" సారధి బహుశా పంపి వుంటాడనుకుంది. శేఖ

రానికేమని చెప్పాలో తోచలేదు. సుందరి సమస్య పరిష్కరిస్తూ యాక్సిడెంటు అయినప్పుడు శేఖరం అక్కడే వున్నాడని జయంతిని హాస్పిటల్‌కి తీసుకు వచ్చింది కూడా అతనేననీ జయంతికి సరిగ్గా అర్థమయ్యేలా బామ్మగారు మరోరకంగా అర్థం చేసుకోకుండా విడమర్చి చెప్పింది.

మరోసారి జయంతి చూపులు శేఖరం చూపులతో కలిసి ఆగిపోయినాయి-అవే చూపులు, అదే అమాయకత; శేఖరం ఆ కళ్ళల్లోకి చూడటం ఇష్టం లేదన్నట్టు ప్రక్కకు తిప్పుకున్నాడు. అతను తిప్పుకునే లోపలే జయంతి చూపులు క్రిందికి వాలిపోయినాయి. తనని గురించి అనెంత అసహ్యంగా ఆలోచించి ఉండొచ్చు! కాని ఆ సమయంలో అతను-ప్రత్యేకించి శేఖరం రావటం అదృష్టం.

శేఖరం ప్రత్యేకించి జయంతితో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రెండుగంటలు కూర్చున్న తర్వాత అంతా వెళ్ళిపోయారు.

మర్నాడు ఎవరూ రాలేదు. మూడోరోజు బామ్మ. పాపని శేఖరం కారులో తీసుకువచ్చాడుగాని అతనసలు పైకి రానేలేదు. సుందరికి ఆఫీసులో యిన్‌స్పెక్షన్ జరుగుతోందిట!

నాలుగోరోజున మధ్యాహ్నం దాటిపోతుండగా గోడకి చేరగిలబడి పరధ్యానగా ఆలోచిస్తున్న జయంతి పాదాలు చప్పుడు అవటంతో ప్రక్కకు తిరిగి చూసింది. వచ్చింది శేఖరం! ఓ చేతిలో ప్లాస్టిక్ బాగ్ నిండా పండ్లు, ఇంకోచేతినిండా పుస్తకాలు ఉన్నాయి.

"మీ పాపకి జ్వరం వస్తోందిట, బామ్మగారు అందుకని రాలేదు." పళ్ళబుట్ట టేబుల్ మీద పెడుతూ అన్నాడు.

"పాపకి జ్వరమా!" కనులు తిప్పి శేఖరంవైపు చూస్తూ అంది.

"అవును - యివిగో! మీకు కాలాక్షేపానికి పుసకాలు."

పుస్తకాలు మంచంమీద పెట్టి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ "ఈ రోజు యెలా ఉంది?" అని అడిగాడు.

ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి. జయంతి చూపులు క్రిందకు వాలిపొయ్యినాయి.

"మీ ఋణం జన్మలో తీర్చుకోలేను" అంది.

"అది నా ప్రశ్నకు జవాబుగాదు" తలవంచుకున్న జయంతివైపు

పరీక్షగా చూస్తూ అన్నాడు శేఖరం. రక్తం పోవటంవల్లనేమో మొహం తెల్లగా పాలిపోయినట్టుగా వుంది. బుగ్గలమీద కండ తగ్గి యెముకలు కొద్దిగా కన్పిస్తున్నాయి. వంచుకున్న తల ప్రక్కనుంచి చూస్తే చక్కటి బొమ్మ వేయటం కోసం ముందు ముఖ్యమైన గీతలు అందంగా గీసి నట్టుంది.

ఇద్దరిమధ్య నిశ్శబ్దం ఏర్పడింది. "కాలు ఎలా వుంది? నడవ నిస్తుందా?" యాక్సిడెంట్ అయినప్పుడు బోర్లాపడడంలో బాగా మెలికి పడటమేగాక బొటనవేలుకి పైన పాదం మధ్యన బలంగా గాయం తగిలింది.

"మెల్లిగా నడిస్తే నొప్పి అన్పించటం లేదు. కాని ఎక్కువసేపు నిలబడనివ్వటంలేదు." పాదం వయిపు చూసుకుంటూ అంది.

"మొహం మీద దెబ్బ?"

"తగ్గిపోతోంది."

"ఏదీ?" శేఖరం లేచివచ్చి జయంతి మొహం మీద గాయం పరీక్ష చేశాడు.

"నేనింకా యీ హాస్పిటల్‌లో యెన్ని రోజులుండాలి?"

"15 రోజులకి పైనేగాని తక్కువకాదు. ఏం?" జయంతి గడ్డాన్ని యెడంచేత్తో యెత్తి కుడిచేత్తో మొహంమీద పడిన జుట్టు తప్పించి మరింతగా పరీక్ష చూస్తూ అన్నాడు.

"ఇంకా పదిహేనురోజులా? ఇంటిదగ్గర పాపకి జ్వరం, బామ్మ ఒకతీ!" ఆ ఆలోచన గుర్తుకురాగానే జయంతి కళ్ళలో నీరు తిరిగాయి. హఠాత్తుగా తిరిగిన యీకన్నీటిని వేరొక విధంగాఅర్థంచేసుకున్న శేఖరం దానిని మెల్లగా తుడుస్తూ "మనకు తెలిసినంతవరకూ ఏ సంఘటన లోనూ చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ చిక్కుకుంటే ధైర్యంతో వాటిని దాటాలి అంతేకాని—"అతనికి తెలియకుండానే కంఠం మృదువుగా మారింది. కుడిచెయ్యి చిక్కిపోయిన జయంతి బుగ్గల్ని అప్యాయంగా నిమిరింది.

"సారీ, శేఖరం!"గుమ్మందగ్గర చిన్న దగ్గుతో పాటు మాటకూడా

విన్పించడంతో శేఖరం, జయంతి ఇద్దరూ ఉలిక్కిపడి వెనక్కి తిరిగారు. వచ్చింది అమూల్య:

"కూడని సమయంలో వచ్చినట్టున్నాను. ఊ! అయితే యీవిడన్న మాట నీ పేషెంట్!వస్తాను." మరోమాటకి అవకాశం ఇవ్వకుండా అమూల్య గిరుక్కున వెనక్కు తెరిగి వెళ్ళిపోయింది.

"అమూల్యా!" శేఖరం తెల్లబోయాడు.

ఆవిడిక్కడి కెందుకు వచ్చింది? అందులో శేఖరం చేతులతో తన మొహం! జయంతి ఒంట్లో రక్తం భయంతో మంచుగా మారిపోయింది.

"ఇప్పుడే వస్తాను." జయంతివైపు చూడకుండానే శేఖరం వెళ్ళిపోయాడు.

తనకి యాక్సిడెంటు అయినట్టు, ఇక్కడున్నట్టు యెవరికీ తెలియదని సుందరి చెప్పింది. భగవాన్! మరి యీవిడెలా వచ్చింది? శేఖరాన్ని నీ పేషెంటా - అంటుందేమిటి? ఇంకా నా మోహాన ఏంరాసిపెట్టివుంది భగవంతుడా! నేను ఏం చేశానో? జయంతి దిండులో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

శేఖరం క్రిందికి దిగివచ్చేసరికి అమూల్యా డాక్టర్ దగ్గర నిలబడివుంది. శేఖరాన్ని చూడగానే "సారీ శేఖరం! నేను జయంతి అనుకోలేదు" అంది.

"ప్లీజ్! నువ్వేం మాట్లాడొద్దు. ఇక్కడనుంచి ముందు వెళ్ళిపోదాం పద." అతను బయటకు దోవతీస్తూ అన్నాడు.

ఇద్దరూ వెళ్తుండగా, నిశ్శబ్దంగా నిశ్చలంగా డ్రైవ్ చేస్తున్న శేఖరంవైపు చూస్తూ "జయంతికీ నీకూ అసలు పరిచయం వుందన్న వూహే నాకు రాలేదు. క్లబ్‌లో అందరూ యేదో యాక్సిడెంటు అయిందని, నువ్వు ఆ పేషెంటుని రహస్యంగా దాచావని, ముఖ్యంగా పేషెంటు అమ్మాయి అనీ అందరూ చెబుతుంటే కుతూహలమనిపించి వచ్చాను" అంది అమూల్యా.

యేం చెప్పాలో తోచని శేఖరం మరింత నిదానంగా డ్రైవ్ చెయ్య

సాగాడు. మళ్ళీ అమూల్య తనే "నాకు నిజంగా చాలా విచిత్రంగా వుంది." అంది

"జయంతిని చూశావా!"

"అవును."

"క్లబ్‌లో అందరికీ పేషెంటెవరో తెలుసా?"

"తెలియదులా వుంది. అయినా నువ్వింతగా ఇందులో దాచుకోవాల్సింది యేముంది?"

"మీరందరూ యీర్ష్యపడి నన్ను దూరంగా నెట్టేస్తారేమోనని భయం వేసి—"

శేఖరం నవ్వుతూ కావాలని అన్నాడు.

అమూల్య చురుగ్గా కోపంగా చూసింది.

విషయం దూరం పోతుందని గ్రహించిన శేఖరం—

"అమూల్యా! సారథి నీకేం చెప్పలేదూ?" అని అడిగాడు.

"నాకా! నాకు చెప్పేదేముంది ?"

"సారథి చెప్పేదేంలేదేమో కాని,నేను చెప్పాల్సింది వుంది. ఇక్కడ కొంతసేపు కారు ఆపుతాను."

కారు టాంక్‌బండ్‌మీదకు రావడంతో ఓ ప్రక్కగా ఆపుతూ శేఖరం చెప్పటం మొదలుపెట్టాడు.

"అబద్ధం_"ఊపిరి బిగబట్టుకొని వింటున్న అమూల్య కోపంగా అంది.

"అలా అని నువ్వు అనుకుంటే నాకు అభ్యంతరం లేదు. కాని క్లబ్బులోనూ, తెలిసినవాళ్ళూ-నీకు తెలుసుగదా! చాలా రోజులనుంచి నా ప్రవర్తనలో ఏం లోపం దొరుకుతుందా, కథలు ప్రచారం చేద్దామా అని యెదురు చూస్తున్న కొంతమందికిది మంచి అవకాశం. కాని యిప్పుడు నాకు తెలుస్తోంది- మీ కుటుంబ గౌరవ మర్యాదలు కాపాడటం కోసం, సారథి పేరు ప్రతిష్ఠలు పాడు కాకుండా ఉండేందుకు మంచి చెయ్యబోయిన నేను మరో విధంగా నాకు నేను నష్టం చేసుకున్నాను. కావాలంటే నువ్వు సారథిని గట్టిగా అడిగిచూడు. అంతేగాని జయంతితో

నాకెలాంటి సంబంధంలేదు. దీనికి నువ్వేం రంగులు పూయకు!" కారు స్టార్టుచేస్తూ అన్నాడు శేఖరం.

ఆ రోజు రాత్రి ప్రొద్దుపోయింతర్వాత పడుకున్న శేఖరం ఎవరో తట్టి లేపినట్టు అన్పించటంతో ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ఎవరూ లేపలేదు. కాని హాల్లో ఫోన్ గణగణా మోగుతోంది. శేఖరం విసుక్కుంటూ లేచి వెళ్ళాడు.

"హలో!"

"హలో! శేఖరంగారేనా?"

"అవును"

"నేను డాక్టర్ పరాంజపేని మాట్లాడుతున్నా పేషెంటు కండిషన్ బాగాలేదండీ! సాయంత్రానికి టెంపరేచర్ వచ్చింది. మీరొకసారి వస్తే బాగుంటుంది. దగ్గర ఎవరయినా ఉండాలి. మా కింకో కేసు రావటంతో నర్సు, నేను బిజీగా ఉన్నాం."

"వస్తున్నాను నేను."

"థ్యాంక్స్" డాక్టర్ ఫోన్ పెట్టేశాడు.

క్షణంసేపు ఆలోచించిన శేఖరం బట్టలేసుకుని బయటకెళ్లాడు. 10 నిముషాల్లో డిస్పెన్సరీ ముందు ఉన్నాడు.

"సారీ! ట్రబులిచ్చినట్టున్నాను. మీరు పైకి వెళ్ళండి."

ఇంకో అర్జంట్ కేసుని చూస్తున్న డాక్టర్, శేఖరానికి చెప్పి వెళ్ళిపోయాడు.

శేఖరం రాగానే అంతవరకూ జయంతిని పట్టుకొన్న నర్స్ క్రిందకు వెళ్ళిపోయింది. జయంతి స్పృహలో లేదు. ఊరికే యేడుస్తోంది. ఏవేవో మాట్లాడోంది.

"సుందీ! నేనేం తప్పు చెయ్యలేదు. చెయ్యలేదు. కనీసం నువ్వయినా నమ్ము" అంటోంది. కాసేపు "బామ్మ యెట్లా—పాపకి జ్వరం. డాక్టర్! మందివ్వండి" అంటోంది. ఇంకొంచెం సేపు వూరికే వెక్కి వెక్కి ఏడుస్తోంది.

కుర్చీలో కూర్చున్న శేఖరం లేచి మంచంమీద కొచ్చి కూర్చుని, జయంతిని చేతులమధ్య తీసుకుని "జయంతీ-జయంతీ!" అని పిలిచాడు.

జయంతి సమాధానం ఇవ్వలేదు. అసలే యెలాగో వుంది. మానసికంగా చాలా బలహీనంగా ఉన్న జయంతి అనుకోకుండా అమూల్యని చూడటంతో ఖంగారుపడిపోయి బెదరిపోతోంది. జయంతిమీద మొట్టమొదటి సారిగా నిజంగా జాలేసింది శేఖరానికి.

తెల తెలవారుతుండగా డాక్టర్ "యెలావుంది?" అంటూ పైకి వచ్చాడు. తన చేతులమధ్య ఏడ్చి ఏడ్చి అలిసిపోయి వాడిపోయినట్టున్న జయంతిని నిశ్శబ్దంగా డాక్టర్‌కి చూపించాడు శేఖరం.

"నిద్రకి మాత్రలిచ్చినా నిద్రపోలేదు. ఈ రోజు ఏమైంది? ఏదో షాక్ తిన్నట్టు ఫీలయిందిలావుంది." జయంతి చేయి తీసుకుని నాడి పరీక్ష చేస్తూ అన్నాడు డాక్టర్.

తూర్పున తెలతెలవారుతోంది. గదిలోకివస్తున్న వెలుతురువైపు నిద్రలేని కళ్ళతో చూస్తున్న శేఖరానికెందుకో జయంతి తన జీవితంలో ముడివేసుకుపోయిందని, బయటకు బలవంతంగా తోసెయ్యాలంటే చాలా బలం కావాలనీ అన్పించింది.

మరో వారంరోజులు గడిచిపోయినాయి. జయంతి నుదుటిమీద గాయం యెర్రటి మచ్చలా తయారయింది. కాలుకూడా తగ్గి నడవనిస్తోంది. రోజూ రెండుపూటలా శేఖరం వచ్చి చూచి వెడుతున్నాడు.

ఓ రోజు శేఖర్ వచ్చేసరికి జయంతి మంచంమీద లేదు. శేఖరం కనులు తిప్పి గదిలోకి అటు ఇటు చూశాడు. దూరంగా కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తోంది.

"అయితే ఫర్వాలేదన్నమాట!" తృప్తిగా చూస్తూ అన్నాడు శేఖరం. వెనక్కి తిరిగి జయంతి మెల్లగా వచ్చి మంచంమీద కూర్చుంది.

"ఏమైంది? అలా ఉన్నావేం?" ఆదుర్దాగా అడిగాడు శేఖరం. జయంతి మొహంలో బొత్తిగా రక్తం లేదు. ఈ కొద్దిరోజులలోనే ఇద్దరి పరిచయం ఎక్కువయింది. జయంతి ప్రక్కగా పడివున్న పుస్తకం లోనుంచి ఓ కవరు తీసి శేఖరానికిచ్చింది. అది సరయిన లీవు లెటర్ యివ్వనందుకు, ఆఫీసులో పనిమీదకూడా సరయిన శ్రద్ధలేనందుకు జయంతిని ఉద్యోగంనుంచి తీసేస్తున్నట్టు పోస్టింగ్ ఆర్డర్!

శేఖరం తలెత్తి జయంతివైపు చూశాడు. "నన్నింకా భగవంతుడు

పరీక్ష చేస్తున్నాడు. కాలు నయం అయిపోతోంది అంటే ఇంకో సమస్య! నేనసలు బ్రతికి వుండటమే అడుగడుగునా శాపంలా అనిపిస్తూంది."

జయంతి హఠాత్తుగా ప్రక్కకు తిరిగి మోచేతి వొంపులో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది. మళ్ళీ ఉద్యోగం దొరకాలంటే యెంతబాధ? ఎన్నిచోట్ల తిరగాలి? ఈ లోపల ఏం తినాలి?

తనభుజంమీద చేయి పడటంతో జయంతి తల తిప్పిచూసింది ఎదురుగుండా శేఖరం! జయంతి పక్కగా మంచంమీద కూర్చుంటూ "సారధి తొందరపడ్డాడు. నాలుగురోజులుంటే నువ్వే రాజీనామా పంపి వుండేదానివి.అయినా సారధి యింత హృదయంలేని మనిషి అని నేనింత వరకూ అనుకోలేదు."

"నే నెలా రిజైనిచ్చేదాన్ని?—" కన్నులు పెద్దవి చేస్తూ అడిగింది.

"తప్పకుండా-నీ కెలా చెప్పాలో నాకు తెలియటం లేదు జయంతీ! సుందరి ఈ సాయంత్రం నీకోవార్త చెప్పటానికి వస్తుంది."

"ఏమిటది?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానని...."

జయంతి కళ్ళలోకి,మొహంలో మారబోయే భావాలని జాగ్రత్తగా పరిశీలిస్తూ అన్నాడు.

జయంతి క్షణంసేపు వెర్రిగా చూసింది. మరుక్షణంలో మొహం యెరుపురంగు తిరిగింది. శేఖరానికది చాలనిపించింది. "తమాషా కిది సమయం కాదు" అంది.

"తమాషా కాదు జయంతీ! ఇప్పటికే క్లబ్‌లో అక్కడా ఈ యాక్సిడెంటును గురించి నానా రకాలుగా అనుకుంటున్నారు."

"ఏమని?"

"నేను నిన్ను బయటకు తీసుకెడితే-సారధి కారుతో యాక్సిడెంట్ అయితే-సారధిని యెవరితో ఈ విషయం చెప్పవద్దని బ్రతిమలాడి నిన్ను రహస్యంగా ఈ హాస్పిటలుకి తీసుకొచ్చి ఉంచానని."

"ఎంత అబద్ధం!"

"ఆ అబద్ధం నిజంకానీ. అందుకే మనవారు వదుగురాడుమాట- అంటారు."

"ఎందుకని?" జయంతి శేఖరంవైపు అనుమానంగా చూస్తూ అంది.

"వాళ్ళమాటే నిజం చేసి నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను" జయంతి భుజాల చుట్టూ చేయివేసి ఒక చేత్తో తలని గుండెల దగ్గరకు లాక్కుని దానిమీద గడ్డం ఆన్చుకుంటూ "నా జీవితంలో ప్రతిఘటనకి ఒక ప్రత్యేకమైన అధ్యాయం ఉంటోంది. నిన్నారోజున స్పృహ లేనప్పుడు నా తొడమీద ఈ తలని పెట్టుకొని తీసుకొస్తున్నప్పుడే అనుకున్నాను; మంచో చెడో నీతో నాకేదో ఉండబోతుందని! థ్యాంక్ గాడ్! మంచే జరిగింది."

"కాని-మీరు "శేఖరం చేతులలోనుంచి తలని తప్పించుకుంటూ అంది జయంతి.

"కాని-ఏమిటిది? మనిద్దరి మధ్య. ఇహ కానీలు లేవు."

"అప్పుడు సారధితో నన్ను-" జయంతి వాక్యం పూర్తిచేయలేకపోయింది. కళ్ళనిండా నీరు గిర్రున తిరిగాయి.

"అదంతా నాకు నువ్వు చెప్పక్కరలేదు నాకు తెలుసు. నేను నమ్మతాను. జయంతీ!" ఇంకా యేదో చెప్పబోతుండగా శేఖరం వారిస్తూ జయంతిని దగ్గరకు లాక్కుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు: "నువ్వు హాస్పిటల్‌నుంచి డిశ్చార్జి కాగానే క్లుప్తంగా, ఆడంబరం లేకుండా మిసెస్ శేఖరం అయిపోతావు- అంతే" నని చెబుతుండగానే శేఖరం పెదవులు నుదుటిమీద నుంచి కళ్ళమీదకు జారి అక్కడ ఒక్క నిమిషం ఆగి, జయంతి రెండు బుగ్గలను స్పృశించినాయి.

"అసలు నీ కోసమే యిన్నాళ్ళు యిలా ఒంటరిగా ఉన్నానని నాకిప్పుడు తెలుస్తోంది. చెప్పు అదృష్టం నీదా, నాదా?"

"నాది, ఇద్దరిదీ!" నోరు తెరిచి పెదవులు విప్పి చెప్పబోయింది జయంతి. కాని చెప్పలేకపోయింది. ఈ లోపల బుగ్గలమీద నుంచి హఠాత్తుగా క్రిందకు వచ్చిన శేఖరం పెదవులు జయంతి పెదవుల్ని బలంగా నొక్కేసినాయి.